# మెంథా దాటికి వరి నేలకొరిగింది

- **రైతులు ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**





**శెనార్తి మీడియా, మంచిర్యాల :** మెంథా తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలుల దాటికి వరి పంటలు నేలకొరిగాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతుల ఆరుకాలం శ్రమను నీటముని గించాయి. పంట చేతికి వచ్చే దశలో ఉండగా వర్షాల వల్ల వరి పంటలు నేలరాలిపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మండలంలో వందల ఎకరాల వరి పంట నష్టపోయి రైతుల ఆశలు ఆవిరయ్యాయి. పంట చేతికి వస్తే అప్పులు తీర్చుకోవచ్చని భావించిన రైతులు ఇప్పుడు కళ్లముందు పంట నాశనం కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా పత్తి పంటలు కూడా అకాల వర్షాల కారణంగా వర్షార్పణమై పనికిరాకుండా పోయాయని కౌలు రైతులు చెబుతున్నారు. అప్పులు చేసి సాగు చేసిన పత్తి దిగుబడి కూడా పూర్తిగా నష్టపోయిందని వారు వివరించారు. ప్రతి సంవత్సరం అతివృష్టి, అనావృష్టుల కారణంగా రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ, పంట నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరుతున్నారు.

### యువరైతు రవీందర్ ఆవేదన...

మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన యువరైతు అర్కటీ రవీందర్ తన 4 ఎకరాల్లో వరి సాగు చేశారు. అకాల వర్షాలు, ఈదురుగాలుల దెబ్బకు పంట నేలమట్టమైపోవడంతో కన్నీటి పర్యంతమయ్యారు. అప్పులు చేసి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి నాశనం కావడంతో రవీందర్ వంటి అనేక మంది రైతులు తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, వ్యవసాయ అధికారులు తక్షణమే పంట నష్టం సర్వే నిర్వహించి, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు తీవ్రం

- **అవినీతిపై క్రిమినల్ కేసులు నమోదు**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవినీతి చోటు చేసుకుంటే కఠిన చర్యలు తప్పవని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సి.ఎస్.) శశిధర్ రాజు తెలిపారు. 2024-25 రబీ సీజన్‌లో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామంలోని డిసిఎంఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న కొనుగోలు కేంద్రంలో అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేంద్ర నిర్వాహకులతో పాటు రామారావు పేటకు చెందిన సుముఖ ఆగ్రో ఇండస్ట్రీస్ యజమానులు, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణాధికారి, ఎనిమిది మంది రైతులు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్‌పై పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ జైపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నంబర్ 207/25గా నమోదు చేసినట్లు తెలిపారు.



ఈ కేసులో 316 (క్లాస్ 5), 318 (క్లాస్ 4) సెక్షన్ల కింద నేరాలు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 1 కోటి 39 లక్షల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. 740 ఎకరాలలో 6,322.6 క్వింటాళ్ల వరి కొనుగోలు చేసినట్లు తప్పుడు వివరాలను ప్యాడి ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో నమోదు చేసినట్టు తెలిపారు. అలాగే రవాణా ఖర్చుల కింద రూ.1.90 లక్షల విలువైన తప్పుడు ట్రక్ చిట్టీలను సృష్టించి నమోదుచేశారని వివరించారు. పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కేసు ప్రస్తుతం పోలీసు శాఖ ఆధ్వర్యంలో దర్యాప్తు దశలో ఉందని చెప్పారు. రైతు సంక్షేమ కార్యక్రమాల్లో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి. శ్రీధర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ అజయ్ బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వరి పొలాల పరిశీలన

- **రైతులు నీరు తొలగించాలి:జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా వరి, పత్తి పంటలకు నష్టం సంభవించిన ప్రాంతాలను జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ... రైతులు తమ పొలాల నుంచి నీటిని పూర్తిగా తొలగించాలన్నారు. వరి కొయ్యలను నిటారుగా పైకి లేపి కుచ్చులుగా కట్టుకోవాలని సూచించారు. దీంతో గాలి సరిగా ఆడి కోత దశలో ఉన్న వరి పైరుకు బ్యాక్టీరియా, శిలీంద్రపు తెగుళ్లు తగలకుండా ధాన్య నాణ్యత కాపాడవచ్చని వివరించారు. పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించి, రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తామన్నారు. రైతులు అధైర్యపడవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్దపెల్లి వెంకటేశం, నసీరుద్దీన్, శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.



# ఏపీఓపై చర్యలు కోరిన ఫీల్డ్ అసిస్టెంట్లు



- **వేతనాల్లో కోత సరైంది కాదని ఆవేదన**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలలో అన్యాయంగా కోత విధించిన ఏపీఓ నవీన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫీల్డ్ అసిస్టెంట్లు గురువారం ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఈద లింగయ్య మాట్లాడుతూ... మండలంలోని అన్ని ఫీల్డ్ అసిస్టెంట్ల అక్టోబర్ నెల వేతనాల నుండి ఒక్కొక్కరి వద్ద నుంచి 250 రూపాయలు మినహాయించారని తెలిపారు. అంతేకాకుండా సారంగపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ వేతనంలో రూ.1397, శంకర్‌పల్లి ఫీల్డ్ అసిస్టెంట్ వేతనంలో రూ.1011 కోత విధించడమూ అన్యాయమని పేర్కొన్నారు. ఏ కారణం చూపకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా వేతనాల్లో కోతలు విధించడం తగదని లింగయ్య తెలిపారు. ఏపీఓ నవీన్‌పై చర్యలు తీసుకుని, ఫీల్డ్ అసిస్టెంట్లకు పూర్తి వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శెట్టి సత్యనారా యణ, లింగాల రాజేందర్, సెగ్గం శంకరయ్య, ఎన్. బాపు, భోగి జ్యోతి పాల్గొన్నారు.

# లింగాపూర్ బీట్‌లో అక్రమ ఆక్రమణలపై సమీక్ష

- **సూచనలను పాటించని వారికి కఠిన చర్యలు**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జన్నారం అటవీ విభాగంలోని మేధరిపేట సెక్షన్ పరిధిలోని లింగాపూర్ బీట్‌లో గురువారం సమీక్షా సమావేశం జరిగింది. తాడ్లపేట అటవీ రేంజ్ అధికారి సుష్మా రావు అధ్యక్షతన కంపార్ట్‌మెంట్ నంబర్లు 379, 380లో జరుగుతున్న అక్రమ ఆక్రమణల పరిస్థితిని పరిశీలించారు. ఈ సమావేశంలో మండల్ గిరాదావర్ బి. భూమన్న, జిపిఒ సిహెచ్. మహేష్, పంచాయతీ కార్యదర్శి బి. ప్రసాద్, కరోబార్ జి. పోచన్న, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాజేందర్, తాడ్లపేట రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు. అక్రమంగా ఆక్రమణలు చేసిన వారు వెంటనే వెదురు, నీలగిరి నాట్లను నాటి, గుడిసెలను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. గ్రామపంచాయతీ, వీఎస్ఎస్ తీర్మానాలను సమర్పించాలని అధికారులని ఆదేశించారు. సూచనలను అమలు చేయనట్లయితే జిల్లా యంత్రాంగం, పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగిస్తాయని తాడ్లపేట రేంజ్ అధికారి సుష్మా రావు హెచ్చరించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్లాంటేషన్ పనులు అమలు చేయనున్నట్లు ఆమె తెలిపారు.



# కొత్తమామిడిపల్లిలో టేకు దుంగల స్వాధీనం

- **తాడ్లపేట అటవీ అధికారుల దాడి**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** విశ్వసనీయ సమాచారం ఆధారంగా తాడ్లపేట అటవీ రేంజ్ అధికారి సుష్మా రావు మార్గదర్శకత్వంలో అటవీ సిబ్బంది గురువారం కొత్తమామిడిపల్లి గ్రామంలో సోదా నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన లడ్డు అలియాస్ గనిశెట్టి కార్తీక్ ఇంటిపై దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో ఎఫ్‌బిఓ (డాగ్ స్క్వాడ్) అనిల్, హంటర్ బృంద సభ్యులు పాల్గొన్నారు. సోదాలో మొత్తం ఎనిమిది టేకు దుంగలను పట్టుకున్నారు. వాటి పరిమాణం 0.389 క్యూబిక్ మీటర్లు కాగా, అంచనా విలువ రూ.33,606గా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అక్రమంగా అటవీ వనరులను దాచిపెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తాడ్లపేట అటవీ రేంజ్ అధికారి సుష్మా రావు పేర్కొన్నారు.




## మాగంటి సునీతకు మద్దతుగా ఇంటింటి ప్రచారం

**బాల్క సుమన్, నడిపెల్లి విజిత్ రావు నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకుల పర్యటన**



**శెనార్తి మీడియా, మంచిర్యాల :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్‌కు మద్దతుగా రహమత్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా పార్టీ అధ్యక్షుడు బాల్క సుమన్, రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు, మాగంటి గోపినాథ్ కుమార్తెలు పాల్గొన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకు ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులు పిలుపునిచ్చారు.

## రన్ ఫర్ యూనిటీలో అందరూ పాల్గొనాలి

**కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సై రాజశేఖర్ పిలుపు**



**శెనార్తి మీడియా, మంచిర్యాల :** సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నిర్వహించనున్న రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ ఎస్సై ఎస్. రాజశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ... శుక్రవారం ఉదయం 7 గంటలకు సింగరేణి పాఠశాల మైదానం వద్ద ప్రారంభమయ్యే 2 కిలోమీటర్ల రన్ పాత బస్టాండ్ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని వివరించారు. పట్టణ ప్రజలు, విద్యార్థులు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని రన్ ఫర్ యూనిటీని ఘనవిజయం చేయాలని రాజశేఖర్ కోరారు.

## ప్రేమ వేధింపుల కేసులో యువకుడు రిమాండ్



**శెనార్తి మీడియా, మంచిర్యాల :** ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడిన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు కోటపల్లి ఎస్ఐ రాజేందర్ తెలిపారు. కోటపల్లి మండలం వెంచపల్లి గ్రామానికి చెందిన యువతిని ఆలుగామ గ్రామానికి చెందిన అంబాల సాయి కుమార్ వేధించినట్లు వెల్లడించారు. యువతిని బ్లాక్‌మెయిల్ చేయడంతో పాటు గ్రామంలో పోస్టర్లు అంటించి అవమానానికి గురి చేసినట్లు విచారణలో తేలిందని చెప్పారు. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు పూర్తిచేసి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రాజేందర్ వివరించారు.

## అకాల వర్షాలతో వరి పంట నష్టం

**పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి ప్రేమ్‌కుమార్**



**శెనార్తి మీడియా, మంచిర్యాల :** ఇటీవల కురిసిన అకాల వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పెర్కపల్లి, బట్వన్పల్లి, అకెనపల్లి గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలకూలిపోయిందని రైతులు తెలిపారు. నష్టాన్ని పరిశీలించడానికి వ్యవసాయ అధికారి ప్రేమ్‌కుమార్ గ్రామాలను సందర్శించారు. వర్షాల ప్రభావం వల్ల పంటలకు గణనీయమైన నష్టం వాటిల్లిందని తెలిపారు. నష్టశాతాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని చెప్పారు. పడిపోయిన వరి మొక్కలను గుంపులుగా చేసి నిలబెట్టి కట్టలు కట్టుకుంటే కొంత మేర నష్టాన్ని తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు. ఈ పరిశీలనలో ఏఈఓ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులకు నాన్ ఓవెన్ సంచుల పంపిణీ

**జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** నిరుపేద, అర్హులైన రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం అందిస్తున్నదని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య తెలిపారు. నవంబర్ 1వ తేదీ నుండి చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు నాన్ ఓవెన్ సంచి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం తీసుకునే సమయంలో ఒక వేలిముద్ర, నాన్ ఓవెన్ సంచి కోసం మరో వేలిముద్ర ఇవ్వవలసి ఉంటుందని వివరించారు. ఏ చౌక ధరల దుకాణంలో రేషన్ కార్డు నమోదై ఉందో, అదే దుకాణంలో వేలిముద్రతో సంచి ఇవ్వబడుతుందని తెలిపారు. పోర్టబిలిటీ విధానం ద్వారా ఇతర షాపుల్లో రేషన్ బియ్యం పొందే వారికి నాన్ ఓవెన్ సంచి ఇవ్వబడదని స్పష్టం చేశారు. రేషన్ కార్డుదారులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పి. చంద్రయ్య సూచించారు.

# రజక వృత్తిదారులకు రక్షణ చట్టం చేయాలి

- రాష్ట్ర అధ్యక్షుడు ఎదునూరి మదర్ డిమాండ్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** రజక వృత్తిదారుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎదునూరి మదర్ డిమాండ్ చేశారు. మంచిర్యాల చార్వువాకలో గురువారం జరిగిన రజక వృత్తిదారుల సంఘం 25వ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పైతర ఓదేలు అధ్యక్షత వహించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది రజక వృత్తి ఆధారంగా జీవనం సాగిస్తున్నారని, వారు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని ఎదునూరి మదర్ పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి తగిన నిధులు కేటాయించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన కోరారు. గ్రామాల్లో రజకులపై కుల వివక్షత, దాడులు పెరుగుతున్నాయని వాటిని అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం అవసరమని తెలిపారు.



రాష్ట్ర కార్యదర్శి పైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ ఉచిత విద్యుత్తు పథకానికి వెంటనే నిధులు విడుదల చేయాలని, కరెంటు బిల్లుల వేధింపులు నిలిపివేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పయిరాల రాములు మాట్లాడుతూ... మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా మోడరన్ దోబిగాట్లకు స్థలాలు కేటాయించాలని, రజక వృత్తిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్, పట్టణ పౌరవేదిక కన్వీనర్ గూమాస ప్రకాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నడిగోటి తిరుపతి, తోట కళావతి, కొండపర్తి సందీప్, నడిగోటి సది తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**ఏఎంసీ మాజీ డైరెక్టర్ దీటి రాజు**

**శెనార్తి మీడియా, బెజ్జంకి:** అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బెజ్జంకి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దీటి రాజు డిమాండ్ చేశారు. రైతులు ఆరుగాలం శ్రమించి పంట కోతకు సిద్ధం చేసుకున్న సమయంలో అకాల వర్షం కష్టాలను నీటిలో కలిపిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ, వాస్తవ కొనుగోలు ఇంకా ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. రైతులు తమ ధాన్యం కుప్పల వద్దే రాత్రింబగళ్లు గడుపుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే ముందుకు వచ్చి పంట నష్టాన్ని అంచనా వేసి, నష్టపరిహారం అందించాలనీ, లేకపోతే రైతులతో కలిసి ధర్నా చేపడతామని దీటి రాజు హెచ్చరించారు.

## ఎస్టీయూ మండల నూతన కమిటీ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** ఎస్టీయూ (రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం) శంకరపట్నం మండల అధ్యక్షునిగా గోలి సతీష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ప్రవీణ్, శైలజ, ప్రధాన కార్యదర్శిగా తాటిపాముల శ్రీనివాస్, కార్యదర్శులుగా హాజీ అహ్మద్, జిల్లా కౌన్సిలర్లుగా మదిరే వేణుగోపాల్, చొప్పదండి రామకృష్ణ ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి ఎండీ రసూల్, ఎన్నికల పరిశీలకుడు గుండా శ్రీనివాస్ తెలిపారు.

## శ్రీశైలం యాత్రకు ప్రత్యేక బస్సు



**శెనార్తి మీడియా, రామగుండం:** కార్తీక మాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం యాత్రకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు గోదావరిఖని డిపో మేనేజర్ ఎం. నాగభూషణం తెలిపారు. ఈ ప్రత్యేక బస్సు నవంబర్ 6వ తేదీ రాత్రి 8 గంటలకు గోదావరిఖని నుండి శ్రీశైలం వైపు బయలుదేరుతుంది. యాత్రలో భాగంగా నవంబర్ 7వ తేదీ రోజంతా శ్రీశైలం ప్రాంతంలోని పుణ్యక్షేత్రాలు శ్రీ మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగం, శ్రీ భ్రమరాంబికా దేవి శక్తిపీఠం, పాలధార, పంచధార, శిఖరం, పాతాళగంగ తదితర పవిత్ర స్థలాల దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం శ్రీశైలం నుంచి తిరిగి బయలుదేరి, నవంబర్ 8వ తేదీ ఉదయం గోదావరిఖనికి చేరుకుం టుంది. గోదావరిఖని నుండి ?2200, పెద్దపల్లి నుంచి ?2100, కరీంనగర్ నుండి ?2000గా చార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఈ యాత్రా అవకాశాన్ని వినియోగిం చుకోవాలని డిపో మేనేజర్ నాగభూషణం కోరారు.

# చీలాపూర్‌లో సివిల్ రైట్స్ డేలి

**లిశెనార్తి మీడియా, బెజ్జంకి:** మండలంలోని లిచీలాపూర్‌లి గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని బెజ్జంకి పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ ప్రజలు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు, రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించడం సమాజ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. సివిల్ హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రజల్లో చట్టపరమైన అవగాహన పెంపుపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్, పోలీస్ కానిస్టేబుల్ సునీల్, సెక్రటరీ శ్రీనివాస్, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.




# వర్షానికి నీట మునిగిన శ్రీ సిద్దేశ్వర శివాలయం

- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

**శెనార్తి మీడియా, శ్రీరాంపూర్ (పెద్దపల్లి):** పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం శ్రీరాంపూర్ గ్రామంలోని భవానీ సమేత సిద్దేశ్వర శివాలయం బుధవారం కురిసిన భారీ వర్షాలతో పూర్తిగా నీటమునిగింది. మల్లయ్య కుంట చెరువులోని నీరు ఆలయ ఆవరణలోకి, పరిసర ఇళ్లలోకి, రహదారులపైకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూజల కోసం ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతుండగా, అర్చకుడు సహా ప్రజలు పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రభుత్వాలు మారినా, నాయకులు మారినా మా సమస్య మాత్రం మారడం లేదు. కనీసం అధికారులు కూడా పట్టించుకోవడం లేదు" అని వారు



వాపోయారు. గ్రామస్థుల ప్రకారం, స్వల్ప వర్షానికే మల్లయ్య కుంట నిండిపోతుంది. దాంతో నీరు శివాలయానికి, పరిసర ఇళ్లకు చేరిపోవడం సాధారణంగా మారిందని చెప్పారు. గత 20 సంవత్సరాలుగా ఈ సమస్య కొనసాగుతున్నప్పటికీ ఎవరూ దానిపై చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. మల్లయ్య కుంట నుండి నీలకంఠ చెరువుకు కలిపే ప్రధాన కాలువ పిచ్చిమొక్కలతో మూసుకుపోవడం, చెరువు చుట్టూ మట్టితో నింపివేయడం వల్ల నీటి ప్రవాహం ఆగిపోయిందని గ్రామస్థులు తెలిపారు. "కాలువ శుభ్రపరిచే పనులు, రహదారి మరమ్మతులు చేయకపోతే ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారం కాదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి" అని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. శివాలయం వీధి ప్రధాన రహదారి కావడంతో ప్రజలు, వాహనదారులు, భక్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# సింగరేణి ఆర్జీ-3 గనిలో వెంటిలేషన్ లోపం

- గాలి అందక కార్మికుడి అస్వస్థత - రక్షణ చర్యల లేమిపై ఆగ్రహం

**శెనార్తి మీడియా, రామగిరి:** సింగరేణి ఆర్జీ-3 ఏఎల్పీ డివిజన్‌లోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ (ఏఎల్పీ)లో గురువారం జరిగిన ఘటన కలకలం రేపింది. ఫ్రీ షిఫ్ట్‌లో 86 లెవెల్ వద్ద పనిచేస్తున్న తోట రవి అనే సపోర్ట్‌మెన్, గనిలో గాలి సరిపడక తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. సహచర కార్మికులు గమనించి వెంటనే అధికారులకు సమాచారం అందించారు. అనంతరం అతన్ని సర్ఫేస్‌కు తరలించి, అంబులెన్స్‌లో సెంటినరీ కాలనీలోని



డిస్పెన్సరీకి పంపించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించిన తర్వాత పరిస్థితి విషమంగా ఉండడంతో గోదావరిఖనంలోని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై తోటి కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "గనిలో వెంటిలేషన్ సరిగా లేకపోవడం, కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. మాకు భద్రత కంటే ఉత్పత్తికే ప్రాధాన్యత ఇస్తున్నారు" అని వారు విమర్శించారు. అదే అంశంపై ప్రశ్నిస్తే అధికారుల నుంచి కక్ష సాధింపు చర్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం ఈ ఘటనపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# "ఆత్మగౌరవాన్ని కోల్పోము-అవమానాన్ని సహించము"

**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు**

**శెనార్తి మీడియా, పెద్దపల్లి:** "ఆకలినైనా భరిస్తాం కానీ ఆత్మగౌరవాన్ని వదులుకోము, అవమానాన్ని సహించము" అని ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ స్పష్టం చేశారు. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై జరిగిన పాశవిక దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు పెద్దపల్లి జిల్లాలో గురువారం ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో సన్నా సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళితులపై జరుగుతున్న అన్యాయాలపై దేశవ్యాప్తంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. "సామాజిక



న్యాయం కోసం సాగుతున్న పోరాటం ఎవరి కృపతో కాదు, మన హక్కుల కోసం మనమే నడిచే యుద్ధం" అని పేర్కొన్నారు. ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ గుండ్ల రాకేష్ మాదిగ మాట్లాడుతూ, నవంబర్ 1న హైదరాబాద్‌లో జరగబోయే ఆత్మగౌరవ ర్యాలీలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని దళితుల గౌరవాన్ని ప్రపంచానికి చాటాలని కోరారు. ఏపూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ప్రపంచం మొత్తం ఖండించాలి. నిందితుడికి కఠిన శిక్ష పడే వరకు పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కన్నూరి ధర్మేందర్ మాదిగ, కాసిపేట రాజయ్య, దశరథం, కొండల రాజేందర్, ఎల్లస్వామి, ప్రసన్న, హర్షిత్, సౌమ్య, ఈశ్వర్, మల్లికార్జున్, సాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత రైతులకు పరామర్శ



**శెనార్తి మీడియా, రామగుండం:** రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, ఆయన సతీమణి మనాలి రాజ్ ఠాకూర్ అంతర్గాం మండలం పొట్యాల గ్రామంలో పర్యటించారు. తాజాగా కురిసిన అకాల వర్షాల వల్ల నష్టపోయిన వరి పంటలను పరిశీలించారు. బాధిత రైతులను పరామర్శించి, దిగులు చెందవద్దని ధైర్యం చెప్పారు. రైతులకు ఎల్లప్పుడూ అండగా రాజ్ ఠాకూర్ ఉంటారని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## రన్ ఫర్ యూనిటీ లో భాగమవ్వండి

**ఎస్సై సౌజన్య**




**శెనార్తి మీడియా, బెజ్జంకి:** భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఆయన గౌరవార్థం నిర్వహించే రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఎస్సై బోయినీ సౌజన్య మండల ప్రజలకు సూచించారు. అందరూ భాగస్వామ్యులై ఐక్యత స్ఫూర్తిని చాటాలని ఆమె పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉదయం 7 గంటలకు ప్రారంభమై ముత్తన్నపేట వరకు రన్ కొనసాగుతుందని తెలిపారు. యవత, వాకర్స్ అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సై సౌజన్య కోరారు.

## కోర్టు ఏర్పాటుకు భవనం పరిశీలన



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** శంకరపట్నం మండలంలో కోర్టు ఏర్పాటు కోసం భవనాన్ని హుజురాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ పరిశీలించారు. శంకరపట్నం న్యాయవాదులు స్థానికంగా కోర్టు ఏర్పాటు చేయాలని హైకోర్టుకు వినతిపత్రం సమర్పించగా, జిల్లా న్యాయస్థానం కరీంనగర్ ద్వారా ఏర్పాట్లను పరిశీలించాలని ఆదేశాలు జారీచేశారు. ఆ సూచనల మేరకు హుజురాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ కేశవపట్నంలోని భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎమ్మార్వో సురేఖ, న్యాయవాదులు, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య, బండారి తిరుపతి, ఇసాముద్దీన్, షారుక్, కళ్లేపల్లి రాజయ్య, సదానందం, అభిలాష్ గౌడ్, బొజ్జ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు

## నీట మునిగిన పంటల పరిశీలన



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా మండలంలోని సుమారు 2100 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. పలు ప్రాంతాల్లో నేల కొరగటం, పంటలు దెబ్బతినటం జరిగింది. ప్రాథమిక విచారణలో 17 గ్రామాల్లో 1503 మంది రైతులు నష్టపోయినట్లు గుర్తించారని అధికారులు తెలిపారు. ఏఓ వెంకటేష్, అన్ని క్లస్టర్ల ఏఈఓలు, రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. ప్రభుత్వం నుండి వచ్చే తదుపరి ఆదేశాల మేరకు రైతు స్థాయిలో సర్వే నిర్వహించి పూర్తి స్థాయి నివేదిక పంపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## కుటుంబ కలహాలతో తల్లీకొడుకులపై దాడి

**తల్లి మృతి.. కొడుకు పరిస్థితి విషమం**

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** శంకరపట్నం మండలం కరీంపేట గ్రామంలో కుటుంబ కలహాలు హత్యకు దారి తీశాయి. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గడ్డం రాజు, భార్య స్వప్న మధ్య తరచు గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో విభేదాలు బుధవారం మధ్యాహ్నం ఘర్షణకు దారితీశాయి. ఈ సందర్భంగా స్వప్న తన తల్లి కడారి లక్ష్మి, సోదరుడు కడారి రజనీకాంత్‌లతో కలిసి రాజు తల్లి గడ్డం మల్లమ్మ (65)పై గొడ్డలితో దాడి చేశారు. సమాచారం తెలిసి ఇంటికి చేరుకున్న రాజుపై కూడా నిందితులు దాడికి దిగారు. గాయపడిన వారిని కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, మల్లమ్మ చికిత్స పొందుతూ మృతి చెందింది. రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దాడి అనంతరం నిందితులు పరారయ్యారు. భార్యాభర్తల మధ్య కొనసాగుతున్న కుటుంబ విభేదాలే ఈ ఘటనకు కారణమని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు హుజురాబాద్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పులి వెంకట్ తెలిపారు.

